

శరవేగంగా జాతీయ రహదారి పనులు

- మోదీ 3.0 వంద రోజుల ప్రణాళికలో రెండు రోడ్లకు చోటు
- దేశ వ్యాప్తంగా మూడువేల కిలో మీటర్ల రోడ్డు ప్రాజెక్టుల ఎంపిక
- అందులో ఆర్మూర్-మంచిర్యాల రోడ్డు... జగిత్యాల-కరీంనగర్ రోడ్డుకు అవకాశం
- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు కేంద్రం ప్రణాళిక
- జాతీయ రహదారి 63, 563లకు రాజయోగం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణాల పనులు ఇక పరుగులు పెట్టనున్నాయి. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రోడ్డు విస్తరణ పనులు, జగిత్యాల-కరీంనగర్ రహదారి పనులకు రాజయోగం పట్టనుంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే ఎన్నికలకు ముందు నుంచే మూడో సారి అధికారంలోకి వస్తే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి...ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి...ఏఏ పనులు పూర్తి చేయాలి... తదితర అంశాలపై సంబంధిత అధికారులతో నరేంద్ర మోదీ సమావేశాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావడంతో ప్రధాని మోదీ మరింత దృష్టి సారించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా మోదీ 3.0 మొదటి వంద రోజుల్లో చేయాల్సిన పనులపై ఫోకస్ పెట్టారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి రెండు రోడ్ల ప్రాజెక్టుల పనులకు చోటు దక్కింది. దేశ వ్యాప్తంగా మొత్తం మూడువేల కిలోమీటర్ల రోడ్డు ప్రాజెక్టులను ఎంపిక చేయగా... అందులో తెలంగాణ నుంచి జగిత్యాల జిల్లా నుంచి వెళ్తున్న రెండు రోడ్డు ప్రాజెక్టులకు అవకాశం కల్పించారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జాతీయ రహదారి 63, జాతీయ రహదారి 563లకు రాజయోగం దక్కనుంది. ఈ వంద రోజుల్లో ఈ రెండు ప్రాజెక్టు నిర్మాణ పనులు ఊపందుకోనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సందర్భంగా ఈ పనుల్లో జాప్యం చోటుచేసుకోగా తాజాగా ఈ రెండు ప్రాజెక్టుల పనులు మళ్లీ పట్టాలెక్కించనున్నారు.

● వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు...

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రోడ్డుకు సంబంధించి గత ఫిబ్రవరిలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. మరో వైపు జగిత్యాల- కరీంనగర్ రోడ్డు విస్తరణకు సంబంధించి సుమారు ఆరు నెలల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటికి సంబంధించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) వేగంగా చర్యలు చేపడుతోంది. వాటిని వీలయినంతా వేగంగా పూర్తి చేసేందుకు త్వరగా పనులు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి న వాటిల్లో తెలంగాణకు సంబంధించి ఈ రెండు జాతీయ రహదారులుండడంతో పనులు మరింత ఊపందుకోనున్నాయి.

● జగిత్యాల- కరీంనగర్ పనులు ఇలా..

జగిత్యాల నుంచి ఖమ్మం వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి 563లో కీలక భాగమైన జగిత్యాల-కరీంనగర్ 58.86 కిలోమీటర్ల పొడవు ఉన్న మరో ప్రాజెక్టును సైతం ప్రధాని నరేంద్రమోదీ 3.0 మొదటి వంద రోజుల ప్రణాళికలో చోటు కల్పించారు. ప్రస్తుతం రెండు వరసలు ఉన్న ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతుండడం, ప్రతీనిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండడంతో విస్తరించాలని నిర్ణయించారు. కరీంనగర్ నుంచి వరంగల్ మధ్య పనులు మొదలు పెట్టగా... జగిత్యాల-కరీంనగర్ మధ్య టెండర్ల ప్రక్రియతో ఆగిపోయింది. సదరు ప్రక్రియను సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి వందరోజుల గడువులో నిర్మాణ పనులను ప్రారంభించడానికి సంబంధిత శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి రూ. 1,500 కోట్లు వ్యయం అవుతుందని గతంలో అంచనా వేయగా.. ప్రస్తుతం సుమారు రెండు వేల కోట్లకు పెరుగుతోందని సంబంధితవర్గాలు అంటున్నాయి. మోదీ 3.0 తొలి వందరోజుల ప్రణాళికలో జగిత్యాల జిల్లాకు చెందిన రెండు రహదారులకు చోటు దక్కడంతో పనులు మరింత వేగవంతమవుతాయన్న ఆశతో ప్రజలున్నారు.

● యాక్సెస్ కంట్రోలు ప్రాజెక్టుగా...

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి జగిత్యాల జిల్లా మీదుగా మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి వరకు నిర్మించనున్న జాతీయ రహదారిని యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టుగా విస్తరించాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నిర్ణయించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు ఎన్‌హెచ్- 63ను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. లారీలు, భారీ ట్రక్కులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండే ఈ జాతీయ రహదారి రెండు వరుసలతో ఇరుకుగా ఉండి నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట పట్టణాలు, గ్రామాలు ఉన్న చోట బైపాస్‌లు నిర్మించి, మిగితా ప్రాంతాల్లో రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. సుమారు 131.8 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ మార్గం అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 69.300 కిలోమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 30.900 కిలోమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 41.813 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి డివిజన్‌లో 14 కిలోమీటర్లు, కోరుట్ల డివిజన్‌లో 17 కిలోమీటర్లు, జగిత్యాల డివిజన్‌లో 38 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ జరుపనున్నారు. ఈ మార్గంలో ఆరు నుంచి 12 కిలోమీటర్ల మేర భారీ బైపాస్‌లుంటాయి. ఇవే కాకుండా సుమారు ఎనిమిది ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లను నిర్మించనున్నా రు. రహదారి క్రాసింగ్‌ల వద్ద ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తారు. ఈ మార్గంలో దాదాపు 46 వంతెనలు, అండర్ పాస్‌లు, ఆర్‌వోబీలు ఉంటాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ. 3,850 కోట్లు కాగా వ్యయం మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల వద్ద 63వ నంబరు జాతీయ రహదారి నాగ్‌పూర్-విజయవాడ 363 జాతీయరహదారితో అనుసంధానం కానుంది.

విస్తరణ పనులపై ప్రత్యేక ఫోకస్

- ధర్మపురి అర్వింద్, ఎంపీ, నిజామాబాద్



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలోని పెర్కిట్ నుంచి మోర్తాడ్, కమ్మరిపల్లి, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాల సమీప ప్రాంతాల నుంచి మంచిర్యాల వరకు విస్తరించనున్న జాతీయ రహదారుల పనులపై కేంద్రం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. మోదీ 3.0 మొదటి వంద రోజుల ప్లాన్‌లో చోటు దక్కడంతో పనులు వేగవంతం కానున్నాయి. అదే విధంగా పసుపు బోర్డు ఏర్పాటుకు సంబంధించి వంద రోజుల ప్లాన్‌లో భాగంగా పనులు జోరందుకుంటున్నాయి.

వంద రోజుల ప్రణాళికతో వేగంగా పనులు

- పైడిపల్లి సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ప్రధాని నరేంద్రమోదీ 3.0 పాలనలో భాగంగా నిర్వహించనున్న తొలి వంద రోజుల ప్రణాళికలో జగిత్యాల-కరీంనగర్, ఆర్మూర్-జగిత్యాల- మంచిర్యాల రహదారులకు చోటు దక్కింది. దీంతో సంబంధిత రహదారుల పనులు మరింత వేగంగా జరగనున్నాయి. తెలంగాణలో చోటు కల్పించిన రెండు రహదారులు జగిత్యాల జిల్లాకు చెందినవే కావడం సంతోషకరము.

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైద్రాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి గులాబీ పార్టీకి రాజీనామా చేసిన విషయం విధితమే. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల మండలం అంతర్గాం గ్రామానికి చెందిన డాక్టర్ సంజయ్ జగిత్యాలలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడో పర్యాయం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎంబీబీఎస్, ఎంఎస్ (కంటి శస్త్ర వైద్య నిపుణులు) విద్యను అభ్యసిం చిన సంజయ్ జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో నేత్ర వైద్యుడిగా మంచిగుర్తింపు పొందారు.

పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 20వేల ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. తొలిసారిగా టీఆర్ఎస్‌లో చేరి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవ ర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 62,616 ఓట్లు రాగా టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ సంజయ్ కుమార్‌కు 54,788 ఓట్లు సాధించి ఓటమి పాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రెండో పర్యాయం పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గా పోటీ చేసిన డాక్టర్ సంజయ్ కుమార్‌కు 1,04,247 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 43,062 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు 70,243 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిపై 15,822 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వరసగా రెండో పర్యాయం మాకునూరి సంజయ్‌కుమార్ విజయం సాధించారు. కొంత కాలంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో టచ్‌లో ఉంటున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షం లో అధికారికంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌గూటికి చేరడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మెట్‌పల్లి సీఐగా బాధ్యతలు స్వీకరించిన నిరంజన్‌రెడ్డి



మెట్‌పల్లి, జూన్ 23: మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదివారం సాయంత్రం నిరంజన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మెట్‌పల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న నవీన్‌ను ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. ఆయన స్థానంలో మెట్‌పల్లి సీఐగా ఐజీ ఆఫీస్‌లో వెయిటింగ్ ఉన్న నిరంజన్‌రెడ్డిని నియమించారు. దీంతో సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ నిరంజన్‌రెడ్డికి మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులకు సన్మానం

జగిత్యాల, జూన్ 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్‌గా పనిచేసిన దివాకర ఇటీవల బదిలీపై వెళ్లగా శనివారం రాత్రి అధికారులకు వీడ్కోలు, బదిలీపై వచ్చిన అధికారులకు వెల్‌కం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల సంఘ బాధ్యులు బోగ శశిధర్, ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగేందర్ ఆధ్వర్యంలో టీఎన్జీవో సంఘ బాధ్యులు, సభ్యులు అధికారులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటూ ఏ విధమైన సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారన్నారు. వారందించిన సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేందర్, సుగుణాకర్, మధుకర్, మహమూద్, సురేందర్ నాయక్, మమత, పవిత్ర, ఖాజీం, మురళి తదితరులున్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్, జూన్, 23: మండలంలోని పెంబట్ల, కోనాపూర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 351 జంటలు వ్రత కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో మర్యాద రామన్న, వావిలాల శేఖర్, గుండ సురేష్, యాంసాని సంతోష్, ఊటూరి సంతోష్, గుండ రాజేందర్, పాత రమేష్, యాసాల మల్లికార్జున్, బోడ్ల వేణు, గంప శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు మొండిచేయి: ఎమ్మెల్సీ

జగిత్యాల టౌన్, జూన్ 23: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగాల భర్తీ విషయంలో నిరుద్యోగులకు మొండిచేయి చూపారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరా భవన్‌లో ఆదివారం జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను రాయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం లక్షాఅరవై వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసి గ్రూప్ వన్ ప్రిలిమ్స్ నిర్వహించామన్నారు. హరీష్‌రావుకు ఉద్యోగాలు భర్తీ చేయడం ఇష్టం లేకనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

జిల్లాలో స్వల్ప వర్షం

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం స్వల్పంగా వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలు, మండలాల్లో సుమారు సుమారు గంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 5.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని గొల్లపల్లిలో అత్యధికంగా 7.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సారంగపూర్ 6.6, వెల్గటూరులో 6.8, బీర్‌పూర్, ధర్మపురి 6.1, మల్లాపూర్ 6.0, ఇబ్రహీంపట్నం, బుగ్గారం 5.6, ఎండపల్లిలో 5.3, మెట్‌పల్లిలో 5.2, కథలాపూర్‌లో 5.1, మేడిపల్లి, భీమారంలో 5.0, కోరుట్ల, మల్యాలలో 4.9, కొడిమ్యాలలో 4.7, జగిత్యాల రూరల్ 4.3, జగిత్యాల 4.2, పెగడపల్లి, రాయికల్‌లో 4.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఇన్‌చార్జి కమిషనర్



చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

జగిత్యాల టౌన్, జూన్ 23: జగిత్యాల మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా శనివారం రాయికల్ ఎంపీడీవో చిరంజీవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం చైర్ పర్సన్ అడువాల జ్యోతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఏఈ శరణ్ తేజ తదితరులు ఉన్నారు.

భూ కబ్జాపై మహిళల ఫిర్యాదు

కథలాపూర్, జూన్ 23: మండలంలోని ఇప్పపల్లిలో మహిళా సంఘాలు కొనుగోలు చేసిన భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడని పేర్కొంటూ ఆదివారం మహిళలు ఫిర్యాదు చేశారు. గడిచిన 2011లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి మహిళలు కొనుగోలు చేశారు. అయితే ఆ భూమిలో నుంచి కొంత భూమిని ఓ వ్యక్తి ఆక్రమించారని సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎస్సై నవీన్‌ను వివరణగా కోరగా ఈ విషయమై గ్రామంలో విచారణ చేపడతామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మెట్‌పల్లిలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాయికల్ మండలం మోతాపూర్‌లో..

మెట్‌పల్లి, జూన్ 23: రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం పట్టణంలోని శాస్త్రి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉంటూ ఏక మొత్తంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తోందన్నారు. రుణమాఫీ చేసినందుకు రైతుల తరుపున సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండ లాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, జలపతి రెడ్డి, తుమ్మనపల్లి రాంప్రసాద్, ఆకుల లింగారెడ్డి, జెట్టి లక్ష్మణ్, సోమిడి శివ, నరేష్, ప్రసాద్, రాజశేఖర్, షేక్ మహ్మద్, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రైతులకు రుణమాఫీ ఆమోదం పట్ల మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుందని, ఉచిత బస్సుతో పాటు మరిన్ని పథకాలను సకాలంలో ప్రజలకు అందించడంలో ముఖ్యమంత్రి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, నాయకులు తలారి రాజేష్, అజారుద్దీన్, గరిపెల్లి శ్రీనివాస్, బూస గంగమల్లయ్య, అనుమల్ల సత్యనారాయణ, నెమిల్ల స్వామి, కొల్ల వేణు, వంగ మల్లయ్య, నారాయణ, రఘుపతి, ఎల్లయ్య, మోహన్ రెడ్డి, పోచయ్య, శేఖర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: రైతులకు ఒకే దఫాలో రుణమాఫీ చేస్తానన్న మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య అన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాత ప్రభుత్వం కాబట్టే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకే దఫాలో రూ. 2 లక్షల రుణాఫీ చేయాలని నిర్ణయించారన్నారు. సన్నాళ్లకు రూ. 500 బోనస్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకే దఫాలో రుణమాఫీ, బోనజ్‌లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధి పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రు. 2 లక్షల రుణమాఫీ చేసి తన చిత్తశుద్ధి చాటుకుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ గత ఏడాది రైతులకు ఇచ్చిన హామీని సీఎం నెరవేర్చబోతున్నారని అన్నారు. గత సర్కారు అప్పుల భారం మోపినప్పటికీ గుండె ధైర్యంతో రైతుల సంక్షేమం దృష్ట్యా రుణమాఫీ చేయబోతున్నారని అన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్



మహిళలతో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్, జూన్ 23: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికపరంగా బలపడాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంతసురేష్ ఆకాంక్షించారు. ఈసందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కల్వకుంట్ల కవిత నాయకత్వంలో అర్బన్, రూరల్ మండలాలు ఎంతో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్ర మాలను జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు.

అనంతరం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆర్థికపరంగా బలపడాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో అర్బన్ జడ్పీటీసీ సంగెపు మహేష్, రూరల్ ఎంపీపీ మహేష్, అర్బన్ ఎంపీపీ లక్ష్మీ, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, రూరల్ మండలపార్టీ అధ్యక్షుడు బాలముకుందం, ఎంపీటీసీ సౌజన్య మాజీ సర్పంచులు రజిత, నరేష్, దామోదర్, ప్రవీణ్‌గౌడ్, మున్నూరుకాపు కులబాంధవులు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేర్చిన సీఎం రేవంత్

- పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి

జగిత్యాల, జూన్ 23(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల 30ఏళ్ల కల సాకారం చేసిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు, ఉపాధ్యాయులకు బదిలీల కు అవకాశం కల్పించడమే కాకుండా, ఈ ప్రక్రియ అంతా గతంలో ఎప్పుడూ లేనంతగా న్యాయపరంగా ఎన్ని చిక్కులు వచ్చిన వ్యక్తులకు ప్రాధాన్యం లేకుండా వ్యవస్థకు ప్రముఖ ప్రాధాన్యం ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాణిక్‌రాజ్, సీఎం ప్రధాన సహాయకులు బుర్రా వెంకటేశం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి విజయ దేవసేనలకు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి నేతృత్వంలో సుమారు 38 సంఘాల ప్రతినిధులు ఆదివారం సీఎం రేవంత్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, జూన్ 23: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. గ్రామశివారులో ఉన్న అమ్మవారి ఆలయం దాకా డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. పోతారాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

- ఒకే రోజు రూ.4 లక్షల ఆదాయం
- వైద్య సౌకర్యం లేక భక్తులకు ఇబ్బందులు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, జూన్ 23: పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒకేరోజు ఆలయానికి రూ.నాలుగు లక్షల మేరకు ఆదాయం సమకూరిందని అధికారుల అంచనా. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. ఆరుద్ర కార్తెలో వర్షాలు పుంజుకునే అవకాశం ఉన్నందున ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే కోడే మొక్కులు, బోనాలు, సమర్పించారు. అనంతరం మదనపోచమ్మ, బంగారు పోచమ్మ, వీరభద్రస్వామి రామాలయాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం, బుధవారం జాతరలో వైద్యం సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన సిబ్బంది కనబడకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. పరకాల మండలానికి చెందిన కొందరు భక్తులు తీవ్రమైన ఉక్కపోతతో అస్వస్థకు గురికాగా చికిత్స కోసం దేవాలయంలోకి వచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది లేకపోయేసరికి ఆటోలో పెగడపల్లిలోని ఒక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జాతరలో నీరు కలుషితం అయ్యే పరిస్థితి ఉన్నందున వైద్య సేవలు అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూన్ 23: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి అనే గీత కార్మికుడు చెట్టు మీద నుంచి కింద పడగా తీవ్ర గాయాల య్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఆదివారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. కాగా తిరుపతి నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.తిరుపతికి ఆర్థిక సహాయం అందజేయాలని గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, దేవేందర్ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

గంభీరావుపేట, జూన్ 23: గంభీరావుపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో తాగునీటి సమస్యపై కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నీటి సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించాలని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పోకిరీల బెడద

- ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్
- కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలు



వాహనాల సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 23: జిల్లాలో పోకిరీల బెడద మితిమీరిపోయింది. పట్టణంలోని కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలుగా చేసుకొని యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. యువకులు ఒక్కో బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నారు. జిల్లాలో స్కూల్స్, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో బస్టాండ్‌లు, ఇళ్లనుంచి కళాశాలలకు వెళ్లే యువతులను ఆటపట్టిస్తున్నారు. యువకుల ఆకతాయి చేష్టలకు కళాశాలకు వెళ్లే విద్యార్థినులు, యువతులు ఆందోళన చెందుతున్నారు. పోకిరీల ఆగడాలపై షీటీమ్ నిఘా వేసినప్పటికీ పోకిరీల ఆగడాలు ఆగడంలేదు. షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

● ద్విచక్రవాహనాలపై చక్కర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ ఆందోళనకు గురి చేస్తున్నారు. యువకుల చేతిలో ద్విచక్రవాహనంపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, యువతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. విద్యార్థినుల ఇళ్ల ముందు చక్కర్లు కొడుతూ హారన్‌లు మోగిస్తూ విసిగిస్తున్నారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే హారన్‌లు నిబంధనలకు విరుద్ధంగా బిగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే యువకులకు ఎలాంటి లైసెన్స్ ఉండదు. మరోవైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు రైడింగ్ చేస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. కాగా షీటీమ్‌లు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా పోకిరీల బెడద తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏడాదిలో వందలాదిమంది యువకులకు షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని కొందరు యువకులు స్నేహితులుగా ఏర్పడి ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ జల్సాలు చేసి కటకటాలపాలైన విషయం తెలిసిందే. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్, కళాశాలలు, తదితర రద్దీ ప్రదేశాల్లో బైక్‌పై చక్కర్లు కొడుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడిన అనేకమంది యువకులను షీటీమ్స్ అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

● షీటీమ్‌ల నిఘా..

సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలపై షీటీమ్‌లు నిఘా వేసినా ఆగడాలు తప్పడంలేదు. జిల్లాలో రెండు షీటీమ్‌లు పనిచేస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడలో ఒక్కో షీటీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘాను పెంచారు. ప్రధానంగా బస్టాండ్‌లు, కూడళ్లు, కళాశాలల వద్ద నిఘా వేస్తున్నారు. మే నెలలో ముగ్గురు పోకిరీలపై కేసు నమోదు చేసి మరో నలగురిపై పెట్టి కేసులు పెట్టారు. అధిక శబ్దం చేస్తున్న 86 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి సైలెన్సర్‌లను రోడ్ రోలర్ చేత ధ్వంసం చేశారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఎక్కడైనా పోకిరీలు యువతులను ఇబ్బందుల పాలు చేస్తే డయల్ 100కు లేదా 8712656425కు సమాచం అందిస్తే వెంటనే షీటీమ్‌లు రంగంలోకి దిగి రక్షణ కల్పిస్తాయి.

నిఘా తీవ్రం : అఖిల్ మహాజన్, ఎస్పీ



జిల్లాలో పోకిరీల ఆగడాలపై నిఘా తీవ్రం చేశాం.. మహిళలు, యువతులను వేధింపులకు గురించేస్తే కఠిన చర్యలు తప్పవు. మహిళల భద్రతకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులు, పోకిరీలు కనిపిస్తే 8712656425, 100కు సమాచారం ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

సాయికిరణ్ హత్య కేసులో నిందితుల అరెస్టు

మానకొండూర్, జూన్ 23: మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్ హత్య కేసులో నలుగురు నిందితుల మానకొండూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయి కిరణ్‌కు హత్య చేసిన బట్టి శ్రీనివాస్, బట్టి సునీత, తమ్మిడి గంగారాం, భీమంకర్ శ్యాంరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నలుగురిని 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికిరణ్ కొద్దికాలం కిందట సిద్ధిపేట జిల్లా మిడిదొడ్డి మండలం కొండాపూర్‌లో కోళ్లఫాంలో కూలీగా పనిచేస్తూ భార్యపిల్లతో కలిసిఉండేవాడు. అదేఫాంలో పని చేస్తున్న బట్టి శ్రీనివాస్, బట్టి సునీతలతో సాయి కిరణ్‌కు స్నేహం ఏర్పడింది. సునీతతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి మధ్య గొడవ జరగడంతో అక్కడ పనిమానేసిన సాయి కిరణ్ మానకొండూర్‌కు వచ్చి ఒక సామిల్‌లో పనిచేస్తుండేవాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ కొండాపూర్ ఫాంకు వెళ్లి అక్కడ శ్రీనివాస్, సునీతతో మళ్లీ గొడవపడ్డాడు. దీంతో శ్రీనివాస్, అతని భార్య సునీత అక్కడి నుంచి వారి స్వగ్రామం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బారెగూడెంకు వెళ్లిపోయారు. అయినప్పటికీ సాయికిరణ్ వారికి ఫోన్ చేసి వేధించసాగాడు. దీంతో విసిగిపోయిన బట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ఎలాగైనా సాయికిరణ్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఏప్రిల్ 19న సునీతతో సాయికిరణ్‌కు ఫోన్ చేయించి వారి స్వగ్రామానికి పిలిపించుకున్నారు. సాయి కిరణ్ రాగానే అతడిపై కర్రలతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం సాయికిరణ్ మృతదేహాన్ని పాడుబడిన వ్యవసాయబావిలో పడేశారు. ఏప్రిల్ 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికిరణ్ ఇంటికి రాలేదని అతడి భార్య మానకొండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి రెండు నెలలపాటు తీవ్రంగా గాలించి నిందితులను పట్టుకున్నారు.

ఇసుక డంపులు స్వాధీనం


పాషిగామలో ఇసుక డంపులు సీజ్ చేస్తున్న అధికారులు

వెల్గటూర్, జూన్ 23: మండలంలోని స్తంభంపల్లి, పాషిగామలో నిల్వ ఉంచిన అక్రమ ఇసుక డంపులను ఆదివారం అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో ఎండల ప్రతాపానికి గోదావరిలో నీటి మట్టం పడిపోవడంతో ఇసుక తేలింది. గోదావరి ఇసుక కొందరి అక్రమార్కుల కన్ను పడింది. కొందరు ట్రాక్టర్ యజమానులు దొరికిన కాడికి దోచుకుందామని గోదావరిలో ఇసుకను తోడి శివారు ప్రాంతాల్లో నిల్వ చేశారు. మరికొందరు రూ.2 వేల నుంచి రూ.2400ల వరకు ఇతరులకు అమ్ముకున్నారు. కొన్ని రోజులుగా ఈ తంతు కొనసాగుతుండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. స్తంభంపల్లి శివా రులో ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఏడు చోట్ల నిలువ ఉంచిన 700 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను పట్టుకున్నారు. పాషిగామ శివారులో సుమారు 169 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను గుర్తించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయసింగ్, తహశీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్, ఆర్ఐ రాజేశ్వరి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ తిరుపతి రావు, డీటీ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత


పట్టుకున్న మట్టి టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టుకున్నట్లు తహసీల్దార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారం మే రకు తనిఖీ చేశామని, తరలింపునకు ప్రభుత్వ అను మతి లేదని తేలిందని పేర్కొన్నారు. తమను చూసిన వాహన డ్రైవర్లు పారిపోయారని, వాహనాలను కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. అను మతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి రైతుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో స్థానిక రైతు బాధ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజు తన బైక్‌పై ఎల్లమ్మ ఆలయం వైపునకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పింది.

పేకాట స్థావరంపై దాడులు

రుద్రంగి, జూన్ 23: మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆ పేకాట స్థావరంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి, చందుర్తి మండలాల శివారు లోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామని, ఐదుగురిని పట్టుకున్నామని, మరో ఐదుగురు పారిపోయారని పేర్కొన్నారు. రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి.. చెప్పులు దొంగిలించి..


సీసీ ఫుటేజీకి చిక్కిన అనుమానితుడు

ఓదెల, జూన్ 23: ఆర్థికంగా చితి కి పోయి గానీ, జల్సాలకు అలవాటు పడి గానీ కొందరు దొంగలు చోరీ లకు పాల్పడి డబ్బు, ఆభరణాలు దోచుకెళ్తారు. కానీ ఒక గుర్తుతెలి యని దొంగ స్టైల్‌గా ఖరీదైన బైక్ మీద ఓదెల మల్లికా ర్జునస్వామి ఆలయానికి తరచూ వచ్చి ఒకే వ్యక్తి కి సంబంధించిన మూడు జతల చెప్పులను ఎత్తుకెళ్లా డు. ఇదంతా సీసీ ఫుటేజీకి చిక్కింది. ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కుమారస్వామికి చెందిన మూడు జతల పాద రక్షలను ఇప్పటివరకు ఎత్తుకెళ్లాడు. కేవలం ఒకే వ్యక్తికి చెందిన మూడు జతలు చెప్పులను ఎత్తుకెళ్లడం సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. చోరీకి పాల్పడిన వ్యక్తి ఎవరు? పాద రక్షలను ఏం చేస్తున్నాడనేది? తెలియాల్సి ఉంది.

ఘనంగా హ్యాండ్‌బాల్ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 23: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం, ప్రపంచ ఒలింపిక్ దినోత్స వాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లయోల విద్యాసంస్థల మైదానంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసర వేని లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాటా్లడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్ర మంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, నాగుల శ్రీనివాస్, జె విజయ్, శ్రీకాంత్, అమర్, శివాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను కాపాడుకుందాం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సుభాష్‌నగర్, జూన్ 23: సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సంస్థను కాపాడుకుందామని కార్మికులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. సింగరేణిని వేలం వేస్తే చూస్తూ ఊర్కొనేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి అడుగులు వేస్తున్నాయని విమర్శించారు. సింగరేణిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా కిషన్‌రెడ్డిపై ఉందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న సంస్థ కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో నష్టాల నుంచి గట్టెక్కిందన్నారు. లాభాల్లో ఉన్న ఈ సంస్థను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు సింగరేణి బొగ్గు గనులను కూడా వేలం వేయడానికి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణిని బొంద పెట్టడానికే ప్రధాని మోదీ కిషన్‌రెడ్డికి బొగ్గు శాఖ మంత్రి పదవి ఇచ్చినట్లుందని విమర్శించారు. బొగ్గు బావుల వేలంలో సింగరేణికి సంబంధించిన శ్రావణపల్లి కోల్‌బ్లాక్ కూడా ఉందని తెలిపారు. ఇది ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిగజారుడు తనానికి నిద ర్శనమని, ఇదంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్ట ఇదేనా అని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని అభ్యంతరం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతని ఆహ్వానిస్తు న్నారని ఆరోపించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి వేలాన్ని వ్యతిరేకిస్తూ మోదీకి లేఖ రాశారని ఈ సందర్భంగా కొప్పుల గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రధానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. వేలం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొనబోతున్నారని ఆయన ఆరోపించారు. వేలంపై సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నోరు విప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటు పరం చేయవద్దని, ఆ ఆలోచనను వెంటనే ఉప సంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జడ్పీ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం లీగల్ నోటీసులు

కరీంనగర్ అర్బన్, జూన్ 23: ఫ్లై యాష్ తరలింపు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేశాడంటూ బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి తరఫున అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినిపల్లి సంతోష్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుందని, దాన్ని వినియోగించుకునేందుకు వీలుండదని నోటీసుల్లో తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో ఫ్లై యాష్ లారీలను నిలిపివేసి ఓవర్‌లోడ్‌తో వెళుతున్నాయని, ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన ఆరోపణలకుగాను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ వార్తను ప్రసారం చేసిన టీ న్యూస్‌తో పాటు నమస్తే తెలంగాణ దినపత్రికకు కూడా అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు.

శిథిలమైన కెనాల్ లైనింగ్


దెబ్బతిన్న లైనింగ్

మల్యాల, జూన్ 23: ఎస్సారెస్పీ కెనాల్ లైనింగ్ శిథిలం అయ్యాయి. మల్యాల మండలంలోని లంబాడిపల్లి శివారులో కొంపల్లె చెరువు సమీపంలో లైనింగ్ పూర్తిగా శిథిలమై మట్టి పెళ్లలు లేస్తున్నాయి. లైనింగ్ శిథిలమైన ప్రదేశాల్లో కెనాల్ నీటితో అక్కడ కోతకు గురై ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ అధికారులు లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానం..ఈ రహదారి

మల్యాల, జూన్ 23: మల్యాల బ్లాక్ చౌరస్తా నుంచి వెళ్లే మల్యాల-పెగడపల్లి మార్గం అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడిగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో గోతులు ఏర్పడి, కంకర లేచి ప్రమాదకరంగా మారగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయిప్పటికీ పనులు పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

బాలికపై వృద్ధుడి అత్యాచారం

- నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు
- పోక్సో కింద కేసు నమోదు

రాయికల్, జూన్ 23: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో సింగు గంగనర్సయ్య (60) అనే వృద్ధుడు ఓ బాలికను మాయ మాటలు చెప్పి తన టైలర్ షాపునకు పిలిపించుకుని ఆదివారం అత్యాచారానికి ఒడిగట్టాడు. స్థానికులు నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయికల్‌కు చెందిన సింగు గంగనర్సయ్య అనే వృద్ధుడు టైలర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. తరచూ టైలర్ షాపునకు వచ్చే ఓ బాలికను ఆదివారం తన షాపునకు పిలుచుకుని మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక షాపునకు వెళ్లిన తర్వాత షట్టర్ తలుపు మూసివేయడంతో గమనించిన స్థానికులు బాలిక కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబీకులతో కలిసి స్థానికులు షట్టర్‌ను తీయాలని బెదిరించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. స్థానికులు వృద్ధుడిని చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- సన్న రకం సాగుచేసే రైతులకు రూ. 500 బోనస్ - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


రేచపల్లిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాలు, దేశంలో ఎక్కడ అమలు జరగడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించే ముందు బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రేచపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ సన్నరకం సాగు చేయమని ఆంక్షలు విధించి ఏ రకమైన బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేశాడని గుర్తు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా సన్న రకం సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటామని తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న రకం సాగును రూ. 500 బోనస్ కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతులపై ఆర్థిక భారం పడకుండా పంటల బీమా పథకానికి 50 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ప్రీమియం చెల్లిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని ఇంకా నాలుగువేల కోట్లు బకాయిలు చెల్లింపు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పర్యాయాలు కలిపి రూ 28వేల కోట్లు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షలు ఏక మొత్తంలో రూ 31వేల కోట్లతో రుణమాఫీ చేస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలో 100 శాతం తాగు నీరందించామని కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించడంతో రాష్ట్రానికి రావల్సిన నిధులు పొందలేక పోతున్నామన్నారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో భగీరథ నీరు ఏ మేరకు అందుతుందో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రేచపల్లిలో నీటి కొరత ఉత్పన్నం కాకుండా గ్రామంలో మంచి నీటి బావికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో గాజుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, ఇబ్రాహీం, లక్ష్మారెడ్డి, హరీష్, ఆకుల రాజిరెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన శూన్యం


చర్చావేదికలో మాట్లాడుతున్న వి ప్రకాశ్

కరీంనగర్ టౌన్, జూన్ 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదనే విషయం స్పష్టమైందని ప్రముఖ జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళేశ్వరాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతపై వివరంగా చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బ్యారేజీలు ఇసుకలో నిర్మిస్తారా అని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే అన్నారని, బ్యారేజీలు ఇసుకలోనే నిర్మిస్తారనే విషయంపై ఆయనకు అవగాహన లేక పోవడం హాస్యాస్పదమని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 86 పియర్స్ ఉంటే మూడు పీయర్స్ దెబ్బతిన్నాయని అయినంత మాత్రాన ప్రాజెక్టును మూలన పడేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరంపై విషప్రచారం చేశాయని అన్నారు. డ్యాం సేఫ్టీ అథారిటీ కూడా ఈ పార్టీలకే వంత పాడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని, తెలంగాణ ప్రజలు దానిని నమ్మారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ ప్రభుత్వం సాగునీటికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో అర్థమవుతుందని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టవద్దని కేసీఆర్ అనలేదని, అందుకు సెంట్రల్ వాటర్ కమిషన్, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. తాను ఏపార్టీలో లేనని, రాజకీయాలతో సంబంధం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ఉద్యమించాలని, మేధావి వర్గం అందుకు కృషిచేయాలని కోరారు. తెలంగాణకు గుండె కాళేశ్వరం ప్రాజెక్టు అని, కేవలం మూడు పీయర్లు కుంగిపోతే ప్రాజెక్టును మూలన పడేస్తారా, పనులు చేసేందుకు ఎల్అండ్‌టీ కంపెనీ ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు ప్రశ్నించారు. ప్రజల సొత్తు అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన రాజం తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపేదీ?

- యేటా వర్షాకాలంలో నీట మునుగుతున్న కాలనీలు - పట్టించుకోని అధికారులు


రాయికల్‌లో నీట మునిగిన కేశవనగర్ (ఫైల్)


కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)

రాయికల్, జూన్ 23: అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో యేటా వర్షాకాలంలో రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు వరదతో ముంపు ఏర్పడుతుంది. పట్టణ శివారు కాలనీలు నీట మునుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రాయికల్, మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భజలాల పెంపునకు ఎంతో దోహదపడుతుంది. వర్షాకాలంలో చెరువు నిండి వరదనీరు ఉప్పొంగి ప్రవహించినప్పుడు పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. భీమన్నవాడ, మత్తడి వాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా పెద్ద చెరువు నిండినప్పుడు చెర్లకొండాపూర్, రాయికల్, మైతాపూర్‌లోని చెరువు కట్ట తీర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. లోలెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. చిన్న వర్షాలకు సైతం లోలెవల్ వంతె నలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతు న్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపెల్లి, వస్తాపూర్, ధర్మాజీపేట, రామాజీపేట గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి ముంపునకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వరద నీరు వస్తోంది..



రాయికల్ పట్టణంలో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కేశవనగర్, గొల్లవాడ, మత్తడివాడ, భీమన్నవాడలోకి నీరు చేరడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకొని నీరు చేరకుండా చూడాలి

- నీలి తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు..



మా వార్డులో వర్షం పడితే చాలు ఇళ్లలోకి నీరు వస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈసారైనా వరదలు రాక ముందే చర్యలు చేపడితే కాలనీవాసులకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ముంపు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురిస్తే ఇబ్బందులు రాకుండా చూడాలి.

- అన్వరీ బేగం, 6వ వార్డు కౌన్సిలర్, రాయికల్

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాల అర్బన్, జూన్ 23: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం జిల్లా కేంద్రంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు పాలాభిషేకం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం వల్ల అనేకమంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా చోటు చేసుకున్న సమస్యకు పరిష్కారం దొరికినట్లయిందన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల శ్రీధర్, నాయకులు వేణుగోపాల్ రావు, సంజీవ రెడ్డి, సత్యం, మ్యాకల శ్రీనివాస్, తిరుపతి, మునిందర్, రాజు, లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో సిరిసిల్ల కలెక్టర్

మల్యాల, జూన్ 23: కొండగట్టు అంజనేయస్వామిని ఆదివారం రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించగా అధికారులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, ఆలయ సిబ్బంది ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ


మేడిపల్లి సత్యంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పరామర్శించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవీ ఆత్మహత్యకు పాల్పడడంతో శోకసంద్రంలో మునిగిన ఆయనను హైద్రాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఓదార్చారు. రూపాదేవీ మృతిపై సంతాపం తెలిపారు.

రేపు మండల స్థాయి క్రీడలు ప్రారంభం

బీర్‌పూర్, జూన్ 23: మండల స్థాయి క్రీడల పాఠశాల ఎంపిక పోటీలు మంగళవారం జడ్పీహెచ్ఎస్ బీర్‌పూర్ పాఠశాలలో జరుగనున్నట్లు ఎంఈవో వాసం భీమయ్య తెలిపారు. ఈ క్రీడాల్లో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులు నాలుగో తరగతి చదువుతూ ఉండాలని వయస్సు 8సంవత్సరాలు 1-9-2015 నుండి 31-8-2016 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎంపికకు విద్యార్థులు ఆధార్ కార్డు ఒరిజినల్, బోనాఫైడ్ లేదా స్టడీ సర్టిఫికెట్ చదువుతున్న పాఠశాల నుంచి, విద్యార్థి యొక్క పుట్టిన తేది సర్టిఫికెట్, ప్రోగ్రెస్ రిపోర్టు ఆఫ్ థర్డ్ క్లాస్, 10 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, క్యాస్ట్ లేదా కమ్యూనిటి సర్టిఫికెట్ తీసుకొని రావల్సిందిగా తెలిపారు. పూర్తి వివరాల కోసం సీహెచ్ లక్ష్మణ్ పీడీ 9866991606, మంజుల ధరణి పీడీ 9573385169, సీఆర్‌పీ బేర రవి 9912291927 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కూరగాయల పంటలకు బీమా కల్పించాలి

కొడిమ్యాల, జూన్ 23: అకాల వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నప్పుడు కూరగాయల బీమా సౌకర్యం కల్పించాలని పూడూర్ మాజీ సర్పంచ్ వెల్మల రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూరగాయల పంటలపై ప్రభుత్వం రాయితీలను రద్దు చేయటంతో రైతులకు కూరగాయల సాగు ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కూరగాయల నిల్వ చేయటానికి సౌకర్యాలు లేకపోవటం, రవాణాలో ఇబ్బందులతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కూరగాయలను పండించే రైతు కష్టనష్టాలను ఓర్చుకుంటున్నారన్నారు. కూరగాయలను అమ్ముకుందామంటే ధరల్లో తీవ్ర వ్యత్యాసం, దళారీల దోపిడీతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు పండించే రైతులకు విత్తనాలతో పాటు, ఎరువులు, మల్చింగ్ షీట్స్, డ్రిప్ వసతి, షెడ్ నెట్స్, పాలీహౌజెస్‌కు అయ్యే ఖర్చులో ప్రభుత్వం 50శాతం రాయితీ ఇస్తే కూరగాయల రైతులు హర్షిస్తారన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయల సాగు చేయటంతో సామాన్యులకు ధరలు అందుబాటులో ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

విత్తనపు పసుపునకు డిమాండ్

- కడాయికి రూ. ఎనిమిది వేలు

మల్లాపూర్, జూన్ 23: గత సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు పసుపు దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఈ ఏడు విత్తనం ధరకు అమాంతంగా డిమాండ్ వచ్చింది. కడాయి విత్తనపు పసుపు ధర ఎనిమిది వేల రూపాయలకు పెరిగింది. కాగా ఈసారి బహిరంగ మార్కెట్‌లో సైతం పసుపు ధర రెండింతలు పెరుగడంతో రైతులు ఆశాజనకంగా ఈ సారి సాగు చేస్తున్నారు. ప్రతి ఏడు పసుపు సాగు చేస్తున్న రైతులకు నష్టాలే ఎదురు అయ్యాయి. పసుపు ధర ఈ సారి అధికంగా పలుకడంతో విత్తనానికి ఎక్కువ రేటు పెట్టి అన్నదాతలు పసుపును సాగు చేస్తున్నారు. గతంలో పసుపు ధర క్వింటాల్‌కు ఎనిమిదివేల రూపాయలు ఉండగా ప్రస్తుతం రెండింతలు పెరిగి రూ. 16వేలు ధర పలుకుతోంది. దీంతో ఈ ఏడు పసుపు పంట సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి, జూన్, 23: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవు అని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. ఆదివారం సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా రాత్రి వేళల్లో వాహనాలను ర్యాష్ డ్రైవింగ్ చేసిన, మద్యం సేవించి వాహనాలు నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

రాయికల్, జూన్ 23: మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో ఆదివారం జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె చౌరస్తాలో గల పావని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, పావనిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచిత బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాదం రాజు, కోల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, నరేందర్, రాజేందర్, రవీందర్, మల్లారెడ్డి, ప్రభాకర్, జలందర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గన్నారు.

రేపు స్పోర్ట్స్ పాఠశాల ఎంపిక పోటీలు

జగిత్యాలరూరల్, జూన్ 23: జగిత్యాల రూరల్ మండలం స్పోర్ట్స్ పాఠశాల నాలుగో తరగతి కోసం ఎంపిక పోటీలు ఈనెల 25 నాడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరుగుతాయని రూరల్ మండల ఎంఈవో గాయత్రి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికేట్, ప్రస్తుతం చదువుచున్న పాఠశాల బర్త్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఒరిజనల్ జిరాక్స్ ప్రతులతో పాటుగా కుల ధ్రువీకరణపత్రం, 10 ఫొటోలు తీసుకొని మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. తేది 01-09-2015 నుండి 31-08-2016 మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరసింహుని ఆలయానికి ప్లేట్స్, గ్లాసులు విరాళం

ధర్మపురి, జూన్ 23: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ప్రసాదశాల లో భక్తులు భోజనం చేసేందుకు ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు సంతపురి మధుసూదన్‌రావు దంపతులు ఆదివారం ప్లేట్స్, గ్లాసులు విరాళంగా అందించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు మధుసూదన్‌రావు దంపతులు ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి తన చేతుల మీదుల 200 ప్లేట్స్, 200 గ్లాసులు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయం పక్షాన మధుసూదన్‌రావు దంపతులను అర్చకులు ఘనంగా ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు స్ఫూర్తిదాయకం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి

జగిత్యాల అర్బన్, జూన్ 23: అఖండ భారతదేశ స్ఫూర్తిని ప్రతి భారతీయుని గుండెలోనూ రగిలించిన జాతీయవాది, నిరాడంబరుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జీవితం, ఆయన దేశంకోసం చేసిన సేవలు చిరస్మరణీయం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణిప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కమల నిలయంలో ఆదివారం శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా పోరాటం చేసి, దో నిషాన్- దో విధాన్ నహీ చలేగా అనే నినాదంతో ముందుకు సాగారన్నారు. సుందరమైన కాశ్మీరం కోసం ప్రాణాలు సైతం త్యజించిన మహనీయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడం కోసం బలిదానం చేసిన చరిత్ర భారతీయ జనసంఘ్ మొదటి అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జుంబర్తి దివాకర్, సిరికొండ రాజన్న, దురిశెట్టి మమత, గాదాసు రాజేంధర్, సిరికొండ లక్ష్మణ్, లింగారెడ్డి, గడ్డల లక్ష్మీ, ఇట్యాల రామ్, గంగాధర్, సిరిపురం బాలాజీ, శంకర్, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని భారత్ సురక్షా సమితి నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి నాయకులు ఏసీఎస్ రాజు, మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మి, అక్కినపల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, శ్రీనివాస్, ప్రభాకర్ ఉన్నారు.

కోరుట్ల: ఆర్టికల్ 370 రద్దు కోసం తన జీవితాంతం పోరాటం చేసిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికే స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదని నినదించిన యోధుడని పేర్కొన్నారు. సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధవేని మహేశ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాడవేని నరేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల నవీన్, జక్కుల జగదీశ్వర్, ధనుంజయ్, కస్తూరి లక్ష్మీనారా యణ, ఇందూరి సత్యం, మ్యాకల గణేశ్, చింతకింది గోపాల్ ఉన్నారు.


ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రావణి,తదితరులు


మల్యాలలో నివాళులర్పిస్తున్న నాయకులు

మల్యాల: అఖండత్వ భారతం కోసం బలిదానం చెందిన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మల్యాలలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బింగి వేణు, గాజుల మల్లేశం, కట్కం లత, ఆనందం, మధు, మహేష్, జవ్వాజి రాజ్‌కుమార్, నీలం రవి, తాటిపాముల శ్రీకాంత్, సంకీర్త్, శ్యామల, గంగవ్వ, సునిత, సుజాత, లావణ్య పాల్గొన్నారు


కోరుట్లలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బలిదాన్ దివస్ సందర్భంగా జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండల బీజేపీ నాయకులు నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, వడ్లకొండ బుచ్చిరాములు, అరుణ్‌కుమార్, శేఖర్, రాజు, భూమేష్, వెంకట్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలో బీజేపీ రాయికల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బలిదానానికి గుర్తుగా కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, సురతాని భాగ్యలక్ష్మి, కురుమ మల్లారెడ్డి, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, కునారపు భూమేష్, కడార్ల శ్రీనివాస్, తిరుపతి నాయక్, లింగంపల్లి రాజేష్, పాలెపు శ్రీనివాస్, దాసరి రవి, ఎల్లా గౌడ్, చింత రాజేష్, కుంబోజి సత్యనారాయణ, కట్కం కిషోర్, జోగ గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో దోనికెల నవీన్, సుంకేట విజయ్, కలాలి రాజిరెడ్డి, సుంకె అశోక్, సుతారి భూమరెడ్డి, సాయిప్రసాద్, అరికెల రాకేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

● సమాచారం సేకరిస్తున్న అధికారులు
● ఉమ్మడి మండలంలో 14,218 కుళాయి కనెక్షన్లు
● నల్లాల పరిస్థితిపై ఆరా

వెల్గటూర్, జూన్ 23: ఇంటింటికీ తాగు నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటా కుళాయిల పరిస్థితిపై అంచనా వేసేందుకు ఇంటింటి సర్వే ప్రారంభించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటా తాగు నీరు అందిం చాలని మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ చాలాచోట్ల మిషన్ భగీరథ నీరు అందడం లేదనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పనితీరుపై రాష్ట్రవ్యాప్తంగా సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వెల్గటూర్ మండలంలో అధికారులు ఇంటింటా తిరుగుతూ కుళాయి కనెక్షన్ ఉందా? ఉంటే కుళాయిల ద్వారా నీరు వస్తుందా? వస్తే ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయి? అవసరాలకు సరిపడా నీళ్లు వస్తున్నాయా? కుళాయిలు పని చేస్తున్నాయా? వంటి సమాచారం సర్వేలో సేకరిస్తూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రతీ ఇంటికి వంద శాతం నల్లా నీరు అందించేందుకు అధికారులు కసరత్తు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు.

● **ముమ్మరంగా సర్వే..**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ముమ్మరంగా మిషన్ భగీరథ సర్వే కొనసాగుతోంది. అధికారులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ వివరాలు సేకరిస్తున్నారు. ఎంపీడీవో రవీంధర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ ఎప్పటికప్పుడు సర్వే పర్యవేక్షిస్తున్నారు. సర్వే బృందం ప్రతీ రోజు చేపట్టిన సర్వే వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తూ ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తున్నారు.

● **యాప్‌లో సమాచారం నమోదు..**

ఉమ్మడి వెల్గటూర్ మండలంలో 30 గ్రామపంచాయతీలు ఉండగా 14,218 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. పంచాయితీ కార్యదర్శులు, కారోబార్లు, ఐకేపీ సిబ్బంది మొత్తం 57 మంది సర్వే సిబ్బంది ప్రతీ రోజు సర్వే చేస్తూ ఫొటోలు, కుళాయి కనెక్షన్ పని తీరు వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.


వెల్గటూర్‌లో మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఇప్పటి వరకు 13,722 కుళాయిల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని అక్కడక్కడా గ్రామస్తుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. పంపు కనెక్షన్లు పనిచేయడం లేదని, సరిగా నీళ్లు అందడం లేదని, పైపులైన్ లీకులతో ఇబ్బంది పడుతున్నామని కొందరు సర్వే బృందానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అధికారులు ఇక నుంచి ప్రతీ ఇంటికీ ప్రతీ రోజు సరిపడా నల్లా నీరు అందించేలా చేయడానికే సర్వే చేపడుతన్నామని ప్రజలకు వివరిస్తూ సర్వే కొనసాగిస్తున్నారు.

● **మండలంలో ముమ్మరంగా సర్వే**

- ఎంపీడీవో రవీందర్‌రెడ్డి

ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని 30 గ్రామపంచాయతీ ల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. సర్వే బృందం చేపట్టిన సర్వేను ప్రతీ రోజు పరిశీలిస్తున్నాము. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నాము. కుళాయిలు ఎంత వరకు పని చేస్తున్నాయి? సరిపడా నల్లా నీరు వస్తుందా? లేదా? వంటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాము.

మారెమ్మ తల్లి దీవెనలతో ప్రజలకు సుఖశాంతులు

కోరుట్ల, జూన్ 23: మారెమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని రాష్ట్ర ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. ఆదివారం పట్టణంలోని మాల, మాదిగ సంఘాలు అనాధిగా వస్తున్న ఆచారంలో భాగంగా మారెమ్మకు అత్యంత భక్తి శ్రద్ధలతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్ళి నైవేద్యం సమర్పించున్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడుతూ అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా శెనిగారపు రాజేశ్, మోర్తాడ్ రాజశేఖర్, చిట్యాల ప్రభాకర్, చిట్యాల శ్రీనివాస్, పసుల కృష్ణప్రసాద్, గంగారాం తదితరులు ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన సదస్సు

ధర్మపురి, జూన్ 23: హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ అకాడమీలో బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జ్యుడీషియల్ అకాడమీ పక్షాన ఈ నెల 22, 23 న రెండు రోజుల పాటు నిర్వహించిన నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ధర్మపురి బార్ అసోసియేషన్ పక్షాన న్యాయవాదులు పాలొన్నారు. భారత ప్రభుత్వం ఇండియన్ పినల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టి జూలై 1 నుంచి అమలులోకి తెస్తున్న మూడు నూతన చట్టాలు భారతీయ న్యాయ నాగరిక్ సురక్షాసంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలపై అవగాహన కల్పించారు.

ఆదివారం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి బొల్లంపల్లి విజయ్‌సేన్‌రెడ్డి, జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్, హైకోర్టు బార్ కౌన్సిల్ ఛైర్మన్ అనంత నరసింహారెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ కాసుగంటి లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. కార్యక్ర మంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రౌతు రాజేష్, సీనియర్ న్యాయవాది దుమ్మెన శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ బందెల రమేష్, జాయింట్ సెక్రటరీ మామిడాల శ్రీకాంత్, ట్రెజరరీ జాజాల రమేష్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, జూన్ 23: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. పురోహితులు పాలెపు రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళల సామూహిక కుంకుమార్చన, స్థాపిత దేవతా పూజ, సహస్ర అభిషేకం, రుద్ర చండీ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గంధం గంగాధర్, నూనె పోశెట్టి, నూనె రాములు, మల్లయ్య, నారాయణ, ఇస్తారి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రాయికల్, జూన్ 23: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఓరగంటి కిషన్‌కు చెందిన పాడి గేదె వ్యవసాయ భూమిలో మేత మేస్తూ విద్యుత్ స్తంభానికి తాకి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె మృతి చెందడంతో రైతు కిషన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఎండపల్లి, జూన్ 23: మండలంలోని రాజారాంపల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా దుంపేటి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా నందిరెడ్డిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రథమ ఉపగవర్నర్ సింహరాజు కోదండ రాములు, చైర్మన్ తన్నీరు రాజేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, జూన్ 23: మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ సంఘం, మాల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఇంటికొక్క బోనం నెత్తిన పెట్టుకొని ఆలయానికి డప్పు చప్పుళ్లతో, యువకులు నృత్యం చేస్తూ వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తూరి స్వామి, సంఘం నాయకులు మల్లయ్య, దేవయ్య, మహేష్, రాజయ్య, లక్ష్మన్, రఘుపతి, సంఘం సభ్యులు, మాల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మల్యాల, జూన్ 23: అగ్నివీర్, కేంద్ర ప్రభుత్వ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు మండలంలోని తక్కళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మొక్కలు నాటారు. శిక్షకుడు, వ్యాయమ ఉపాధ్యాయుడు కల్వకోట గంగసాగర్ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రాణకోటికి చెట్లే జీవనాధరమని మొక్కలు పెంచుతూ సంరక్షించాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు సూచించారు. గంగసాగర్, ఉద్యోగ సన్నద్ధ విద్యార్థులు పాల్గొన్నారు.

జోగిన్‌పల్లిలో సంఘం సభ్యుల మధ్య ఘర్షణ

● ఇద్దరికి తీవ్రగాయాలు
● జగిత్యాల ఆసుపత్రికి తరలింపు

కోరుట్ల రూరల్, జూన్ 23: మండలంలోని జోగిన్‌పల్లిలో ఓ సంఘ సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం... శంకర్ అనే వ్యక్తి కొంత కాలం కిందట సంఘం నుంచి అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించమని అనేకసార్లు సంఘ సభ్యులు చెప్పినప్పటికీ వినిపించుకోకపోవడంతో ఆదివారం మరింత ఒత్తిడి తెచ్చారు. దీంతో శంకర్ ఆయన కొడుకు మల్లేశం కలిసి సంఘ సభ్యులైన మన్న, నరేశ్, రాములపై దాడి చేశారు. ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జగిత్యాలకు ఆసుపత్రికి పంపి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఒలింపిక్స్ డే వేడుకలు


ఒలింపిక్ టార్చ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏలేటి ముత్యంరెడి

మెట్‌పల్లి, జూన్ 23: ఒలంపిక్స్ డే వేడుకలను పట్టణంలో క్రీడాకారులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఒలింపిక్స్ డే సందర్భంగా మెట్‌పల్లి కొత్త బస్టాండ్ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద టార్చ్ ర్యాలీని నిర్వహించగా ఆయన ప్రారంభించారు. పట్టణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, పేట సంఘం సంయుక్తంగా క్రీడాకారులు ఒలింపిక్ టార్చ్‌తో ప్రధాన రహదారుల మీదుగా శాస్త్రి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. క్రీడలతో శారీర దృఢత్వం పెరుగుతుందని, మానసిక ఉల్లాసంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సుంచు అశోక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు ఆడడం ఎంతో అవసరం అన్నారు. అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు గజలి రాందాస్, మారుపల్లి కార్తీక్, గంగాధర్, నాగరాజు, క్రీడకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాల అర్బన్, జూన్ 23: పట్టణంలోని రాజరాజేశ్వర ఉన్నత పాఠశాలకు చెందిన 1990-91 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారు రాణిస్తున్న రంగాలను వివరించకుంటూ, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆత్మీయంగా గడిపిన క్షణాలు ప్రతీఒక్కరి హృదయాల్లో హత్తుకున్నాయి. తమ విద్యాసంవత్సరంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తుకు తెచ్చుకొని ఉత్సాహంగా గడిపారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం 1998-1999 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో వచ్చి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు ఒకరితో ఒకరు ఆత్మీయతను పంచుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలను చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆకుల అనిల్, వెంకటరమణ, మహేష్, సతీష్, దేవయ్య, సింగిల్ విండో చైర్మనులు బండ రవీందర్‌రెడ్డి, రాజనర్సింగరావు, రిటైర్డ్ ఉద్యోగులు హన్మంతరెడ్డి, కాంతయ్య, మాజీ ప్రజాప్రతినిధులు రామస్వామి రాంరెడ్డి, లింగాగౌడ్, కాంగ్రెస్ నాయకులు సతీష్‌రావు, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.


జగిత్యాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎండపల్లి: మండలంలోని ఎండపల్లి గ్రామంలో 2002-2003వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము చదివిన తరగతి గదుల చుట్టూ తిరుగుతూ అందరు సరదాగా గడిపారు. పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎండపల్లిలో..


కొడిమ్యాల మండలం పూడూర్‌లో..